




***మనిషి మృత్యువును ద్వేషిస్తాడు; భయపడుతాడు. ప్రాణోత్క్రమణ సమయంలో తాను ప్రేమిస్తున్నవారు, తనను ప్రేమిస్తున్నట్టుగా తాను నమ్ముతున్నవారు తోడు ఉండాలని కోరుకొంటాడు. అదీ కరవైతే?***

## రాధారాఘవ్

**ఆస్పత్రిలో** బెడ్‌మీద పడుకుని ఉన్న కుంతల ఏదో అలికిడిలా వినిపించినట్టయి కళ్లు విప్పి చూసింది. "వచ్చారా, అమ్మా, ఆయన?" అంది హీనస్వరంతో.

కుంతల తల్లి కూతురికి దగ్గరగా వచ్చింది. "వస్తారమ్మా. అదిగో, కబురు వెళ్లిందిగా. ఇంక వచ్చేస్తారు. నువ్వు కొంచెంసేపు విశ్రాంతి తీసుకో, తల్లీ!" అంది అనునయంగా.

"విశ్రాంతికేమిటిలే, అమ్మా. ఇంక మృత్యుదేవత ఒడిలో శాశ్వత విశ్రాంతే తీసుకోవచ్చు. వారికేమని కబురు పంపించావమ్మా? తన కుంతల మరణోన్ముఖురాలయి ఉందనీ, తన కోసమే పరితపించిపోతోందనీ కబురు పంపించావా, అమ్మా?"

"అలాంటిమాట అనకమ్మా. నేను వినలేను. కబురు వెళ్లిందిగా. ఈపాటికి వచ్చేస్తూ ఉంటారు."

"నీ పిచ్చిగాని, రారమ్మా ఆయన! ఆయన నా ముఖం చూడరింక. కబురు వెళ్లి ఎంతసేపయింది? వచ్చేవారైతే యీపాటికి రానే వద్దురు. అయినా ఇన్నిసార్లు కబురు పంపితే రానివారు, యీసారిమాత్రం వస్తారా?"

"అదేమిటమ్మా, అలా అంటావు? ఆయన రాకపోవడమేమిటి? వస్తూనే ఉన్నారుగా? నువ్వు నిద్రపోతూండడంవల్ల లేపలేదు. ఏ రోజు కారోజు, ఏదో టైములో వచ్చి, నీ క్షేమ సమాచారాలు కనుక్కుని వెళ్లిపోతూనే ఉన్నారు.'

"ఎందుకమ్మా, ఇంకా యీ ఆఖరి సమయంలోకూడ నన్ను మభ్యపెట్టాలని చూస్తున్నావు? ఇన్ని రోజులయింది. ఆయన ఎన్నిసార్లు వచ్చినా, నేను నిద్రపోతూ ఉన్నానన్న మాట నన్ను నమ్మమనే చెప్తున్నావా? ఆయన అడుగుల చప్పుడు, కంఠస్వరం నిద్రపోతున్నా, ఏంచేస్తున్నా, ఆఖరికి మృత్యుద్వారంలో అడుగు పెట్టబోయే సమయం వచ్చినా నేను గుర్తించగలనమ్మా. ఇంకా నువ్వు నా మనస్సును మభ్యపెట్టడానికి ప్రయత్నించకు."

ఒక్క క్షణంవరకూ ఆవిడ ఏమీ మాట్లాడలేకపోయింది. కొంచెంసేపటికి తేరుకుని అంది: "ఆయనకుమటుకు రావాలనీ, నీదగ్గర కూర్చోవాలనీ ఉండదా తల్లీ? అక్కడ పిల్లలు నువ్వు లేకపోవడంతో బెంగపెట్టుకుపోతున్నారు. భయంతో ఒక్క క్షణం తండ్రిని వదలడం

లేదు. ఇక్కడే ఉండాలని ఉన్నా ఆయనకు ఎలా వీలవుతుందమ్మా? నీదగ్గర మేమంతా లేమా? ఎవరొచ్చిమటుకు ఏం చేస్తారు? కంటితో చూసి బాధపడాలేగాని, నీ బాధను తీసివెయ్య లేరు గదా?''

ఈసారి కుంతల తల్లి ముఖంలోకి పరిశీలనగా చూసింది. ''ఈ మాటయినా నిజం చెప్పమ్మా. ఆయన పిల్లలనైనా బాగా చూస్తే అంతే చాలు. ఆయన రాకపోయినప్పటికీ కూడ నువ్వు ఎందుకిలా అబద్ధమాడుతున్నావో నాకు తెలుసు. ఇంకా నా మనస్సును నొప్పించవద్దు. పూర్తిగా కాకపోయినా కొంతయినా సంతృప్తితో కళ్లు మూయగలుగుతాను. పోనీ, నా పిల్లలనైనా బాగా చూస్తున్నారా? చెప్పమ్మా! చెప్పు'' అంటూ వెక్కెక్కి ఏడ్చింది.

''ఏం మాటలు, తల్లీ, అవి? ఏడవకు'' అంటూ ఆవిడా దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది.

కుంతలే ఆవిడను ఓదార్చవలసి వచ్చింది. ''ఏడవకమ్మా. ఏడవకు. నేను నిన్నుకూడ నొప్పిస్తున్నాను'' అంది బలవంతాన దుఃఖాన్ని ఆపుకోవడానికి ప్రయత్నం చేస్తూ.

* * *

కుంతల లక్షాధికారుల ముద్దుల తనయ. బి. ఎ. చదివింది. అందానికి అప్సరస. అందమైన అవయవ సౌష్ఠవం, సుకుమారమైన రూపురేఖలు, వీటికి తగిన అలంకరణతో దంతపు బొమ్మలా ఉంటుంది. ఆమెతో సరిసమానమైనవాడు, ఆమె యోగ్యతకు తగినవాడు అయిన మధుతో ఆమె వివాహం జరిగింది. అతను, ఆమె చదివే కాలేజీలోనే ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. చూసేవాళ్లందరూ ఆ యీడూ జోడూ చూసి ఎంతో ముచ్చటపడేవారు. వారిద్దరూ ఒకరిని విడచి ఒకరు ఉండేవారు కాదు. ఒకరి అభిరుచులను ఒకరు గౌరవించుకుంటూ ఎంతో అన్యోన్యంగా ఉండేవారు.

విచారమంటే ఏమిటో ఎరుగకుండా, దుఃఖం అంటే తెలీకుండా, ఆనందడోలికలలో ఓలలాడుతూ, స్వర్గమంటే వేరేముంది? అన్నట్టుగా ఉండేవారు. వారి అన్యోన్యతకు చిహ్నంగా ముద్దులు మూటగట్టే యిద్దరు పిల్లలు పుట్టారు.

ఒక రోజు మధు యింటికి వచ్చేసరికి ఇల్లంతా మూగపోయినట్టుగా ఉంది. ఎప్పుడూ ఆరోగ్యంతో హుషారుగానూ, చలాకీగానూతిరిగే కుంతల, ఆ వేళ చిరునవ్వు మోముతో తనకోసం ఎదురుచూస్తూ కనిపించకపోయేసరికి, 'ఏమిటా?' అనుకుంటూ మధు పైకి వచ్చాడు. కుంతల మంచంమీద పడుకుని ఉంది. ఆమె ఒంటిమీద చెయ్యివేసి చూసేసరికి ఒళ్లు నిప్పులా కాలిపోతూంది. ''ఎప్పట్నుంచి కుంతలా, ఈ జ్వరం? డాక్టరు వచ్చి చూశాడా? ఏమన్నారు? మరి యింతవరకూ నాకు ఫోన్ చేశావు కావేం?'' అంటూ ఆదుర్దాగా ప్రశ్నల వర్షం కురిపించి, వెంటనే డాక్టరుకు కబురు పంపాడు.

కుంతల నీరసంగా నవ్వింది. భర్త ముఖంలోని ఆదుర్దా, ఆ కంగారు చూసేసరికి అతనికి తనయందున్న ప్రేమకు ఆమెకెంతో ఆనందమయింది. తెల్లగా, విశాలంగా ఉన్న అతని నుదుటిమీద మెరుస్తూన్న స్వేదబిందువులను చేత్తో తుడుస్తూ, ''ఎందుకండీ, అనవసరపు కంగారు? రెండు రోజుల్లో పోదూ?'' అంది.

డాక్టరు వచ్చి ఆమెను చూశాడు. ఊరిలో మశూచికం ఎక్కువగా ఉందని, ఆ లక్షణాలు కనిపిస్తున్నాయని చెప్పాడు. భయంకరమైన మశూచి! మనుష్యుల రూపాలను రూపాలపళంగా ఆహుతి చేసుకునే అమ్మవారు! కుంతల భయంతో వణికిపోయింది. పేరుమోసిన తన అందం, అన్నీ యీనాటితో సరేనా? అతలా మధును పెనవేసుకుపోయి వెక్కెక్కి ఏడవసాగింది.

''ఎందుకు, కుంతలా, అంత భయం? ఇదేదో మామూలు జ్వరం. అంతే. అదే పోతుంది రెండు రోజుల్లో. నేనుండగా నా కుంతల దగ్గరకు ఆ జబ్బు రావడమే! పెద్ద పెద్ద డాక్టర్లను తెప్పిస్తాను యిప్పుడే. ఎంత డబ్బయినా ఖర్చవనీ. నా కుంతలను రక్షించుకుంటాను'' అన్నాడు ఉద్రేకంగా. రాత్రి, పగలు నిద్రాహారాలు మాని ఆమె మంచందగ్గరే పడి ఉండి సపర్యలు చేశాడు. కాని—

ఆ రోజు ఆమెకు మశూచికం లక్షణాలు కనిపించాయి. ఇంట్లో చిన్నపిల్లలు ఉన్నారు. అంటువ్యాధి అన్న భయంతో డాక్టర్ల సలహామీద, ఆమెను ఆస్పత్రిలో చేర్పించడం జరిగింది. ఎంత డబ్బయినాసరే, చూసుకోకుండా అన్ని సౌకర్యాలూ సమకూర్చబడ్డాయి.

కుంతల బాధతో కొట్టుకుపోతూంది. ఒళ్లంతా సూదులు గుచ్చుతూన్నట్టుగా పోట్లు. ఇటూ అటూ కదలలేని స్థితి. ఇదిగాక హృదయం తూట్లు తూట్లు చేసే బాధ ఒక ప్రక్కన. అంతవరకూ ప్రాణాధికంగా ప్రేమించిన భర్త, అంటురోగానికి జడిసి తనకు దూరంగా పారిపోతున్నాడు.

'ఎంత యిదిగా ఉండేవారు! ఒక్క క్షణం తనను చూడనిదే ఉండలేకపోయేవారే! పుట్టింటికి వెళ్లి నాలుగురోజులుంధామన్నా, వదిలి ఉండలేననేవారే! అలాంటివారు, ఒకనాడు తను ప్రాణప్రదంగా చూసుకున్న తన కుంతల, ఈనాడు భయంకర రోగంతో, భరించరాని బాధ ననుభవిస్తూ, మంచమెక్కి, మృత్యువుతో పోరాడుతూ, తనకోసం — ఆఖరిసారిగా ఒక్క చూపుకోసం, ఒక్క మాటకోసం అలమటించి పోతున్నా, ఒక్కసారైనా చూడటానికి రాలేకపోతున్నారు కదా! ఎంత నిర్దయులైపోయారు!

'ఆరోగ్యంగా ఉన్నంతకాలం సంసారం చేసి,


## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక చందాదారులకు విజ్ఞప్తి!

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కొరకు చందా పంపేవారు ఈ దిగువ పేర్కొన్న అంశాలు పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నాము:

1 చందా పంపేటప్పుడు మని ఆర్డర్ కూపనులో కాని ఉత్తరంలో కాని తమకు ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక పంపాలని స్పష్టంగా వ్రాయాలి.

2 పాత చందాదారులు తమ చందా సంఖ్య ఉదాహరించాలి.

3 ఎంతకాలం పంపవలసినది స్పష్టంగా వ్రాయాలి.

4 గ్రామం పేరు, పోస్ట్ ఆఫీసు, ఏతీరుమీదుగా పంపవలసినది (అవసరమైన సందర్భాలలో) తాలూకా, జిల్లా మున్నగు వివరాలు అన్నీ స్పష్టంగా వ్రాయాలి

5 చందా మొత్తం 'మేనేజర్, ఆంధ్రప్రభ లిమిటెడ్, విసెంటురోడ్డు, గాంధీనగర్ విజయవాడ 3' చిరునామాకు పంపాలి.

**సాలుచందా రు. 15-60 న. పై**

**6 నెలలకు రు. 7-80 న. పై.**

**3 నెలలకు రు. 3-90 న. పై.**

సదా చందాదారుల సహకారం ఆశిస్తున్నాము.

మేనేజరు.

## ఏజంట్లు కావలెను

ఆఫ్‌సెట్ క్యాలెండర్లకు ఆర్డర్లు బుక్ చేయుటకు అనుభవముగల ఏజంట్లు కావలెను. 14'' × 20'' సైజు క్యాలెండర్లు 1000కి వెల రు. 275/- మంచి కమీషన్. వ్రాయండి.

**ELITE CALENDAR CO.,**
**P. B. 1927, MADRAS-1.**

SWASTIK

# భార్యాభర్తలు

అందంగా ఉన్నంతసేపూ అనుభవించి, మృత్యువుకు భయపడి దూరంగా తొలగిపోతున్నారు.

'తను చచ్చిపోతూంది. తనకోసం, కని పెంచిన తలిదండ్రులు కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నారు ఒక ప్రక్కన. అయినా తన హృదయంలో ఏదో శూన్యస్థితి ఏర్పడి ఉంది. తనువులు వేరైనా మనస్సులు ఒకటే నను కుంది. ఒక్కసారి ఆయన తన దగ్గరగా వచ్చి, తన బాధకు సానుభూతి చూపుతూ, ప్రేమతో పలకరిస్తే, తను ఎంత సంతోషంగా మరణించ గలదు!

'ఎంత ఖర్చుపెడితేనేం? ఎన్ని చేస్తేనేం? తనకు కావలసింది అదా?

'అబ్బ! ఇంత బాధ తను ఎలా భరించ గలదు? నేనీ ఆవేదనను భరించలేనమ్మా. నా హృదయం బ్రద్దలైపోయినా బాగుండును. మృత్యుదేవత ఎప్పుడు కనికరిస్తాడో' అంటూ ఏడుస్తూంది కుంతల.

* * *

మధు బాధతో మంచంమీద పొర్లుతూ, "కుంతలా! కుంతలా!" అంటూ ఏడుస్తున్నాడు.

'ఇన్ని కబుర్లు పంపినా రాలేదని, అందరిలా నువ్వుకూడా, నన్ను దుర్మార్గుడిననే భావిస్తున్నావా, కుంతలా? అంటురోగానికి జడిసే రాలేదనుకుంటున్నావా? అందమైన నీ ముఖాన్ని చూసిన యీ కళ్లతో, యీ వికృతాన్ని చూసి భరించలేను, కుంతలా! బాధంటే ఎరుగని నా కుంతల అంత బాధ పడుతూంటే నేను చూడ లేను. నీ స్థితి చూసి భరించే శక్తి నాలో లేదు. ఎవ రేమనుకున్నా సరే. నేను రాక్షసుడననే అనుకోనీ. నేను రాను... రాలేను. ఇంక నిన్ను చూడలేను. అబ్బ! ఎంత పాపిష్ఠివాడినైపోయాను, కుంతలా! ఆఖరి సమయంలో అయినా నిన్ను చూసుకోడానికి నోచుకోలేదు కదా? విచారమంటే ఎరగను. స్వర్గమంటే యిదే అనుకున్నాను. అంతా మూడునాళ్ల ముచ్చట చేసేసి, నన్ను నరకంలో వదిలేసి వెళ్లిపోతున్నావా, కుంతలా! ఎలా భరించను, యీ ఒంటరితనం?' అంటూ జుట్టు పీక్కుంటూ రోదిస్తున్నాడు మధు.

* * *

మధు వచ్చాడు. ఆస్పత్రికి వచ్చాడు. కుంతలను చూడటానికే వచ్చాడు. ఆమె తండ్రి వచ్చి మధు చేతులు పట్టుకున్నాడు. "కుంతల నీకోసం అలమటించిపోతోంది బాబూ! ఆఖరి క్షణం. ఒక్కసారి కనిపించి ఆమె ఆత్మకు శాంతి కలిగించు. ఒక్కసారి రా" అంటూ ప్రాధేయపడ్డాడు. ఆ వృద్ధుని కన్నీరు మధును యింక నిలబడనీయలేదు. రాక తప్పలేదు అతనికి.

ఒకనాడు అందానికి పేరుమోసిన కుంతల, యీనాడు ఊహించలేని విధంగా, ఎంతో భయంకరంగా మారిపోయి వికృతంగా పడి ఉంది. ఆమెను చూసి కంపించిపోయాడు మధు. గుమ్మం పట్టుకుని అలాగే నిలబడి పోయాడు, ఒక్క అడుగు ముందుకు వేయకుండా.

కుంతల తల్లి ఏడుస్తూ, "ఇప్పటికైనా వచ్చావా, నాయనా! ఇన్నాళ్లకు ని కుంతలమీద దయ కల్గిందా?" అంటూ ఏడవసాగింది.

కుంతల ఆ వేళంతా స్మారకం లేకుండానే పడి ఉంది. అలజడి విని కళ్లు విప్పి చూసింది. ఎదురుగా మధు. తన భర్త. ఇన్నాళ్లూ తను ఎవరికోసమైతే పరితపించిపోతూందో, ఒళ్లంతా కళ్లుచేసుకు ఎవరిని చూడాలని అయితే ఎదురు చూస్తూందో అతనే.

ఇంతవరకూ అతనికోసం కన్నులు కాయలు కాసేలా చూసిన ఆ చూపులు, అతనికోసం — అన్నీ యీ ఆఖరి క్షణంల సేసరికి అంతులేని అసహ్యంగా మారిపోయాయి. ఆమెలోని ప్రతి అణువూ [illegible] చూపించింది. నర నరాలు ఉద్రేకంతో కంపించాయి.

ఇవరకూ చైతన్యం లేకుండా పడి ఉన్న ముఖంలోనూ, ఆమె చూపుల్లోనూ ద్యోతకమవుతూన్న ఏదో తెలీని కదలిక, ఆ కళ్లలోని మెరుపు — భర్తను చూసి ఆమెలో కలిగిన యీ మార్పును చూసేసరికి ఆమె తల్లి తండ్రులు తల్లడిల్లిపోయారు. ఏదో ఊహించలేనటువంటి భయంకర పరిణామం జరగబోతూంది. అదేమిటో, ఎటువంటిదో తలుచుకునేసరికి వాళ్లు భయంతో వణికిపోయారు.

ఆమె కళ్లు క్రమేపీ పెద్దవిగా విచ్చుకున్నాయి. ఒక రెప్పపాటుకాలం అతని వైపు చూసింది.

'వివాహంనాడు చేసిన ప్రమాణాలన్నీ అప్పుడే మరిచిపోయావా? కష్టసుఖాలలో పాలు పంచుకుంటానన్నావు — నా సుఖాలనైతే పంచుకున్నావుగాని, నా కష్టాలలో పాలు పంచుకోలేక పోయావు. అంటువ్యాధి అనే భయంతో పిరికివానిలా పారిపోయావా, నీచుడా! పవిత్రమైన వివాహధర్మానికి నీ ప్రవర్తనతో కళంకాన్ని తెచ్చిపెట్టావా? ఇదేనా ధర్మం? ఇదేనా న్యాయం?' అని ఆమె చూపులు నిలదీస్తున్నట్టున్నాయి. ఆ చూపుల్లోని అసహ్యాన్ని, తిరస్కారాన్ని చూడలేక తల వంచుకున్నాడు మధు.

ఆఖరి నిమిషంలో గాలికి అల్లలాడే దీపంలా ఎక్కడో మిణుకు మిణుకుమంటూంది ఆమె ప్రాణం. అటూ యిటూ ఒక అంగుళంమేర కూడా కదపలేని స్థితిలో ఉంది ఆమె శరీరం. అయినా ఆ శరీరాన్ని ఎలా కదల్చగలిగిందో—అతి ప్రయత్నంతో, ఎంతో కష్టంమీద కదిపి, నెమ్మదిగా ప్రక్కకు తిరిగింది. ఆమె కళ్లు ఒక్కసారి వెలిగాయి.

"వెళ్లండి, ముందు మీరిక్కడినుంచి. మీ ముఖం నాకు చూపించద్దు" అంది. ★

ఝాన్సీరాణి విగ్రహం (మాలంపూజా డామ్—పాల్ ఘాట్)

ఫోటో—ఎస్. జి. శేషగిరి (కోయంబత్తూరు-9)

